

వీరుడికి కన్నీటి వందనం
కశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిలో చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన వీర సైనికుడు కార్తీక్ మృతి చెందాడు
- 8లో



పరశురామేశ్వరుని సేవలో..
ఏర్పేడు మండలం గుడిమల్ల పరశురామేశ్వరస్వామిని ఆర్కియాలజీ కమిషనర్ దర్శించుకున్నారు.
- 8లో



గీత కార్మికులకు మద్యం దుకాణాలు
ఉమ్మడి జిల్లాలో కల్లుగీత కార్మికులకు వైన్ షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.
- 8లో

న్యూస్‌రీల్

స్టార్టప్‌ల కోసం దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ టెక్నాలజీ పథకం జెనెసిస్ ప్రోగ్రామ్ కింద దేశంలోని టైర్–2, 3 నగరాల నుంచి స్టార్టప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐడియా స్టేజ్, ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌ల యాజమాన్యాలు ఫిబ్రవరి 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపిక చేసిన స్టార్టప్‌ల ఆవిష్కరణలకు రూ.10లక్షల గ్రాంట్ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల ఔత్సాహికులు పద్మావతి మహిళా వర్సిటీ అధికారిక వైబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు సివిల్స్ ప్రిలిమ్స్‌కు నోటిఫికేషన్

తిరుపతి సిటీ: దేశానికి అత్యున్నత స్థాయి అధికారులను అందించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. ఈ మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కసరత్తు పూర్తి చేసింది. ఉన్నత స్థాయి ఉద్యోగాలైన ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌లను అందించే సివిల్స్ నోటిఫికేషన్ కోసం జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఏటా సివిల్స్ పరీక్షకు జిల్లా నుంచి సుమారు 2వేల మంది అభ్యర్థులకు పైగా దరఖాస్తు చేసుకుంటూ ఉండడం గమనార్హం.

రిపబ్లిక్ డే క్యాంప్‌లో తిరుపతి క్యాడెట్ల ప్రతిభ



ట్రోఫీలతో ఎన్‌సీసీ క్యాడెట్లు లోకేష్, మహిమరాజు, అంజలి

తిరుపతి సిటీ: న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే క్యాంప్ సందర్భంగా నిర్వహించిన ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి 2ఏ ఆర్ అండ్ వీ గ్రూప్‌నకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు అసాధారణ ప్రతిభను కనబరిచారు. పలు విభాగాల్లో ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ లోకేష్ డ్రెస్సేజ్ ఈవెంట్‌లో బంగారు పతకం, టెంట్ పెగ్గింగ్‌లో రజత పతకం సాధించారు. ఢిల్లీ ఎన్‌సీసీ అధికారుల నుంచి 'బెస్ట్ రైడర్ బాయ్స్' ట్రోఫీ అందుకున్నారు. అలాగే ఎన్‌సీసీ క్యాడెట్ మహిమ రాజు డ్రెస్సేజ్ ఈవెంట్‌లో రజతం, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ అంజలి చాలెంజింగ్ సిక్స్ బార్ జంపింగ్ ఈవెంట్‌లో ట్రోఫీతో పాటు డ్రెస్సేజ్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ అనూప్ ఆర్ మీనా, శిక్షకుడు సుబేదార్ సీబీ కుష్వాహా, సుబేదార్ టీకే గోర్రై, హవల్దార్ నేత్ర రామ్ తదితరులు క్యాడెట్లను అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు లోకేష్, మహిమరాజు, అంజలి ఈనెల 26వ తేదీన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొననున్నారు

25న ప్రకృతి సేద్యంపై వర్క్‌షాప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంపై ఎస్వీయూలో నిర్వహించనున్న వర్క్‌షాప్ పోస్టర్‌ను వీసీ అప్పారావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25, 28వ తేదీల్లో వర్క్‌షాపు జరుగుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై యువత, రైతుల్లో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 25న వెయ్యి మంది విద్యార్థులకు, 28వతేదీన వెయ్యి మంది రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. వర్క్‌షాప్‌కు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, సీడీసీ డీన్ సీఎస్ రాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కేటీ రామకృష్ణారెడ్డి, నిర్వాహకుడు డాక్టర్ పాకనాటి హరికృష్ణ, వార్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 83,806 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,352 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.59 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

వైకల్య విలాపం!



దివ్యాంగుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోంది. వైకల్యంతో అవస్థలు పడుతున్నారనే కనికరం కూడా లేకుండా వేధిస్తోంది. పింఛన్ సొమ్ముతో పొట్టపోసుకునేవారి ఆత్మాభిమానంపై నిస్సంకోచంగా దాడి చేస్తోంది. శాపగ్రస్త బతుకులను స్వార్థ రాజకీయాలకు బలిపెడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నింపిన మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు దారుణంగా వ్యవహరిస్తోంది. సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన పేరుతో విభిన్న ప్రతిభావంతులను కక్షపూరితంగా సాధిస్తోంది. అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు నిరుపేదల నోటికాడ కూడును నిర్దయగా లాగేస్తోంది. ఈ క్రమంలో దివ్యాంగుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. కుంటి సాకులు చెప్పి ఎక్కడ పెన్షన్ తొలగిస్తారో అనే ఆందోళన వారిని వెంటాడుతోంది. సర్కారు నిరంకుశ వైఖరిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- దివ్యాంగులను సాధిస్తున్న ప్రభుత్వం
- సదరం సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో వేధింపులు
- పెన్షనర్ల సంఖ్య తగ్గించడమే లక్ష్యం
- 3 నెలల పాటు కొనసాగనున్న ఏరివేత ప్రక్రియ
- భయాందోళనలో పింఛన్‌దారులు

జిల్లా సమాచారం

మొత్తం పింఛన్లు	2,64, 636
నగదు పంపిణీ	రూ. 112.257 కోట్లు
దివ్యాంగ పెన్షన్లు	31,153
నగదు పంపిణీ	రూ. 18.69 కోట్లు

తిరుపతి తుడా: సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి తన నైజం ప్రదర్శించారు. పెన్షన్ సొమ్మును పెంచినట్టే పెంచి, లబ్ధిదారులను తగ్గించడంలో ఆయన దిట్ట. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. హామీలను నెరవేర్చడం సంగతి దేవుడెరుగు ఉన్న వాటికే ఎసరు పెట్టేస్తున్నారు. బాబు పన్నాగంలో తొలుత దివ్యాంగులే బలవుతున్నారు. వైకల్యంతో పింఛన్ అందుకుంటున్న వారిపై ముందుగా కొరడా ఝుళిపించారు. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న పెన్షనర్ల సంఖ్యను సగానికి పైగా తగ్గించాలని అనధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అంగవైకల్యం శాతం తగ్గించి చూపించాలని దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు జిల్లాలో సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన మొదలైంది. తిరుపతి రుయా ఆస్పత్రిలో దివ్యాంగులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి.

అనధికారిక ఆదేశాలు

సదరం సర్టిఫికెట్ల ద్వారా పింఛన్లు పొందుతున్న వారితో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం అనధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆస్పత్రి సిబ్బంది బహిరంగంగానే చర్చించు



మానసిక సమస్యతో బాధపడుతున్న కుమారుడితో వచ్చిన వృద్ధురాలు (ఇన్‌సెట్) ఈఎన్‌టీ పరీక్ష కోసం..

రెండో రోజుకు టెస్ట్‌లు

దివ్యాంగ పెన్షనర్ల అర్హతను వైద్య పరీక్షల నిర్ధారించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో జిల్లాలో వైకల్య శాతం నిర్ణయించే సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ చేపట్టారు. మంగళవారంతో వైకల్య సామర్థ్య పరీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. కంటి, వినికిడి, మూగ, మానసిక విభాగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక్కో శాఖకు 50 మంది చొప్పున పింఛనుదారులను కేటాయించారు.

ప్రతి ఒక్క పెన్షనర్‌కీ పరీక్ష

అంగవైకల్యంతో బాధపడుతూ గతంలో సదరం సర్టిఫికెట్ పొంది పింఛన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికీ మరోమారు వైద్య నిర్ధారణ పరీక్షలు చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. రీ వెరిఫికేషన్‌లో అర్హత సాధిస్తేనే పింఛన్ ఇవ్వాలని పేర్కొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తక్కువ శాతం వైకల్యం ఉన్నవారికి కూడా పింఛన్ ఇచ్చారని నిందలు మోపుతోంది. ఇదే సాకుగా చూపిస్తూ దివ్యాంగుల బతుకులతో చెలగాటమాడుతోంది. గత ఐదేళ్లలో సదరం సర్టిఫికెట్ తీసుకున్న వారికే కాకుండా, దివ్యాంగుల పింఛన్ మొదలైనప్పటి నుంచి పొందుతున్న వారికి సైతం ఈ నిబంధన అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో దయనీయ స్థితిలో ఉన్న దివ్యాంగులు సైతం సదరం సర్టిఫికెట్ కోసం క్యూ కట్టాల్సిన దుస్థితి దాపురించింది. కుటుంబీకుల సాయంతో రుయా ప్రాంగణానికి చేరుకుని గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. మూడు నెలల పాటు రీ వెరిఫికేషన్ సాగనున్న నేపథ్యంలో విభాగాల వారీగా పలువురికి టైం స్లాట్ కేటాయించారు. దీంతో మరోసారి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదీ వారంలో మూడు రోజులపాటు మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించనుండడం గమనార్హం

కుంటున్నారు. గతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 40శాతం అంగవైకల్యం ఉన్నవారికి సైతం పింఛన్ మంజూరు చేశారు. ఇప్పుడు ఆ శాతం మరింత తగ్గించి పెన్షన్‌దారులపై అనర్హత వేటు వేసేందుకు కూటమి సర్కారు కుట్ర పన్నుతోందని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో తమ పొట్టకొడతారేమో అని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.



కంటి పరీక్షల కోసం పడిగాపులు



వినికిడి సామర్థ్యం పరీక్షిస్తున్న వైద్యులు



మానసిక చికిత్సా విభాగం వద్ద ఎదురుచూపులు



కంటి పరీక్ష కోసం అంధురాలి అవస్థ

ఉపాధి పనులు వేగవంతం

తిరుపతి రూరల్: ఉపాధి నిధులు రూ.3.99 కోట్లతో మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని డ్వామా ఏపీడీ రెడ్డెప్ప ఆదేశించారు. తిరుపతి రూరల్ మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఏపీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ రూరల్ మండలంలో రూ.3.99 కోట్లతో 11 కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈ పనులను ఈ నెలఖారు లోపు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఏపీఓ మమతరాణి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ రెడ్డెప్ప

24న ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు ఈనెల 24న బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం. విజయవాడ హెడ్‌క్వార్టర్ నుంచి ఆయన తిరుపతికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐసీడీఎస్ పీడీ బదిలీ

తిరుపతి అర్బన్: ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి పదోన్నతిపై బదిలీ అయ్యారు. పీడీగా పని చేస్తున్న ఆమెకు డీడీగా పదోన్నతి కల్పించి ఒంగోలు ఆర్జేడీగా నియమించారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు పంపించారు. 15 రోజుల్లోపు ఆమె రిలీవ్ కావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఆమె స్థానంలో పీడీగా ఎవరికి బాధ్యతలు అప్పగించలేదు. మరో వారం రోజుల్లో కొత్తవారిని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం.



జయలక్ష్మి

త్వరితగతిన భూసేకరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర స్థాయి అధికారులతో భూసేకరణ అంశాలపై కలెక్టర్ ముందుగా మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలుకు వినతి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావు

వరదయ్యపాళెం: వరి కోతల సమయానికి ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ప్రసాదరావుకు వరదయ్యపాళెం మండలంలోని ముస్లింపాళెం, చెన్నవారిపాళెం, సీఎల్ఎన్‌పల్లె రైతులు విన్నవించారు. మంగళవారం మండల పర్యటనకు వచ్చిన ఆయనను రైతులు కలిసి పలు సమస్యలు వెల్లడించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కంటే బస్తాకు రూ. 600 నుంచి రూ. 800 వరకు రేటు తగ్గినట్లు వాపోయారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే తీవ్రంగా నష్టపోవాల్సిన వస్తుందని వివరించారు. వ్యవసాయశాఖ అధికారిమాట్లాడుతూ రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పకుండా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం, ఏఓ గౌరి పాల్గొన్నారు.

తళుకు బెళుకులే.. అభివృద్ధి కలే!

- ఫ్లెమింగో పెస్టివల్ పేరుతో పులికాట్ సరస్సు అభివృద్ధి ఎక్కడ?
- ముఖద్వారాల పూడిక తీతకు మోక్షం లేదా?
- జీవవైవిధ్యం కోల్పోతున్న సరస్సు

సూళ్లూరుపేట: ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న పులికాట్ సరస్సు అభివృద్ధి కలగా మారింది. జీవ వైవిధ్యాన్ని కోల్పోతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. 2001 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్ పేరుతో తళుకు బెళుకులతో సరిపెడుతున్నారు తప్ప పులికాట్ సరస్సు అభివృద్ధి కోసం ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం విమర్శలకు తావిస్తోంది. గడిచిన 24 సంవత్సరాల్లో 20 సార్లు ఫ్లెమింగో పక్షుల పండుగను టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు నిర్వహించాయి. కానీ పులికాట్ సరస్సు అభివృద్ధికి గాని, నేలపట్టు పక్షులు రక్షిత కేంద్రం, భీములవారిపాళెం పడవల రేవు అభివృద్ధికి గానీ ఒక్కటంటే ఒక్క పని కూడా చేసిన పాపాన పోలేదు. టీడీపీ ప్రభుత్వం పండుగను తామే తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోవడం తప్ప పులికాట్ సరస్సుకు, పర్యాటకపరంగా చేసిన అభివృద్ధిపై నోరుమెదపని పరిస్థితి.

జీవ వైవిధ్య సరస్సుగా గుర్తింపు

ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల్లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, తిరువళ్లూరు జిల్లాల పరిధిలో సుమారు 620 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులికాట్ సరస్సు విస్తరించి ఉంది. ఇందులో 500 చదరపు కిలోమీటర్లు ఆంధ్రరాష్ట్రం పరిధిలోని నెల్లూరు జిల్లా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వాకాడు, చిట్టమూరు మండలాల్లో విస్తరించ్రుంది. బంగాళాఖాతం నుంచి తమిళనాడు పరిధిలోని పలవేరికాడ్ వద్ద ఒక ముఖద్వారం, వాకాడు మండలం కొండూరుపాళెం, రాయదొరువు వద్ద రెండు ముఖద్వారాలు ఉన్నాయి. సముద్రంలో ఆటుపోట్లు వచ్చి అలల ఉధృతి పెరిగినపుడు అందులో నుంచి ఉప్పునీరు పులికాట్‌లోకి ప్రవేశిస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలసిన సంగమం కావడంతో మత్స్య సంపద విపరీతంగా అభివృద్ధి చెందుతుంది. సుమారు 20 వేలమంది మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడమే కాకుండా 204 రకాలకు చెందిన 1.2 లక్షల విదేశీ వలసపక్షులకు ఆహారాన్ని అందిస్తూ జీవవైవిధ్యాన్ని సంతరించుకుంది.



శ్రీహరికోట సమీపంలోని రాయదొరువు వద్ద ఇసుక మేటలతో పూడిపోయిన సముద్ర ముఖద్వారం

హామీల 'పండగ'!


పక్షుల పండుగ అంటే మూడు రోజుల పాటు సినీ తారల తళుకు బెళుకులు, సినీ యాంకర్లు, పాట కచ్చేరీలు, అర్ధనగ్నంగా డ్యాన్స్‌లు, కామెడీ షోలు, మిమిక్రీలు లాంటి సాంస్కృతిక కార్యక్రమాలతోనే సరిపెట్టేస్తున్నారు. నేలపట్టులో పక్షులు నివసించేందుకు చెట్లు పెంచడం, పులికాట్ సరస్సులో నీళ్లు ఎప్పుడూ ఉండేలా ముఖద్వారాలు పూడిక తీయించడం, భీములవారి పాళెం పడవల రేవు వద్ద రిసార్ట్స్ ఏర్పాటు చేయడం, ఎప్పుడూ బోట్ షికారు ఉండేలా చర్యలు చేపట్టడం లాంటి పనులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా ఎవరూ ప్రయత్నాలు చేయలేదు. ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌లో చేర్చుతామని హామీ ఇచ్చారు. అలాగే పులికాట్ ముఖద్వారాల పూడిక తీతకు రూ.142 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ హామీలు ఎంత మేర నెరవేరుతాయో వేచి చూడాలి మరి.

ఫైళ్లలోనే పూడిక తీత

సముద్ర ముఖద్వారాల పూడిక తీతపై 2007లో మెరైన్ ప్రదేశాల యాజమన్య సంస్థ బేస్‌లైన్ సర్వే చేసింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు ముఖద్వారాల పూడికతీతకు సుమారు రూ.12 కోట్ల అంచనాలతో 2010లోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీనికి అప్పట్లో రూ.10 కోట్లు దాకా వచ్చే అవకాశం, 2013 మేనెలలో ఉత్తర్వులు కూడా వచ్చాయి. ఆ తరువాత చెన్నైకి చెందిన ఓషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా సర్వేలు జరిపారు. 2019లో చంద్రబాబునాయుడు ముఖద్వారాల పూడిక తీతకు రూ.48 కోట్లు మంజూరు చేస్తానని చెప్పారు. ఆ తరువాత ఎంపీగా ఉన్న మద్దిల గురుమూర్తి కూడా దీనిపై పలుమార్లు కేంద్ర పర్యావరణ, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ వారితో మాట్లాడారు. ఆనాడు ఆగిపోయిన ఫైళ్లను కదలించే ప్రయత్నాలు చేస్తున్నారు.

తమిళనాడు తరహాలో పూడికి తీయించాలి

తమిళనాడులోని పల్‌వేరికాడ్ ముఖద్వారాన్ని ప్రతిఏటా సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఇసుకమేటలు తొలగించే ప్రక్రియను చేపడుతున్నారు. అందుకే దక్షిణ వైపు భాగం సరస్సు ఎప్పుడూ జలకళతో కళకళలాడుతోంది. వాకాడు మండలం రాయదొరువు, కొండూరుపాళెం ముఖద్వారాలు మూసుకు పోవడంతో వేసవిలో ఉత్తర వైపు సరస్సు ఎడారిని తలపిస్తుంది. పూడిక తీయిస్తే ఈ ప్రాంతంలో కూడా సరస్సు ఎప్పుడు జలకళతో కళకళలాడే ఆవకాశం ఉంది.



వేసవిలో ఎండిపోయి కళావిహీనంగా మారిన సరస్సు (ఫైల్)

క్లుప్తంగా

పరశురామేశ్వరుని సేవలో ఆర్కియాలజీ కమిషనర్

రేణిగుంట : ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వర స్వామివారిని మంగళవారం రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్ కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు, కార్యనిర్వాహణాధికారి రామచంద్రా రెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి: ముగ్గురు సెల్‌ఫోను దొంగలను అరెస్టు చేసి, వారి నుంచి 50 స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డీఎస్పీ నరసింహమూర్తి కథనం.. డోన్ పట్టణంలోని శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22), శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన మురళి(37), అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రంకు చెందిన సాయిశివ(29) హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తుండేవారు. ఈజీ మనీ కోసం స్మార్ట్ ఫోన్లను చోరీ చేస్తుండేవారు. వీరికి ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ బాలుడు సహకారం అందించేవాడు. మంగళవారం పట్టణ శివారులోని నంది కూడలి వద్ద శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా వెళ్లడం గమనించారు. అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 50 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసకున్నారు. మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

చిరుత కదలికలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో చిరుత కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామని, అటవీశాఖ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్సిటీలో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ సిబ్బందికి తెలిపామని, వారు సీసీ కెమెరాలను అమర్చారని వెల్లడించారు. అలాగే సూచిక బోర్డులతో పాటు ఉద్యోగులను, విద్యార్థులను అప్రమత్తం చేశామని వివరించారు. అటవీశాఖ అధికారులు వర్సిటీ ప్రాంగణంలో బోనులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

జన్మభూమి సేవలో తరించాలని కలలుగన్నావు
చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు
మారుపేరుగా నిలిచావు
పట్టువదలని విక్రమార్కుడిలా
సైనిక శిక్షణ పొందావు
సరిహద్దులో గస్తీ కాస్తూ దేశ రక్షణలో
అహర్నిశలు శ్రమించావు
ఎముకలు కొరికే చలిని సైతం
లెక్క చేయకుండా ఎదురొడ్డి పోరాడావు
ముష్కరులను ముట్టడించి తిరుగులేని
ధీరత్వం ప్రదర్శించావు
ఉగ్రమూకల తూటాలకు రొమ్ము చూపి
భరతమాత ఒడిలో ఒరిగిపోయావు
ప్రజల మదిలో చిరస్మరణీయుడిగా
నిలిచిపోయావు
దేశ చరిత్రలో నీ సేవలను సువర్ణాక్షరాలతో
నిక్షిప్తం చేసుకున్నావు
వీరుడా నీకు మరణం లేదు..
ధీరుడా నీ త్యాగం వృథా పోదు



ఎగువరాగిమానుపెంటలో కార్తీక్ ఇంటి ముందు విషాదంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

వీరుడికి కన్నీటి వందనం



వీరమరణం చెందిన కార్తీక్(ఫైల్)

ఉగ్రవాదుల కాల్పుల్లో సైనికుడు కార్తీక్ వీరమరణం

- ఆయన స్వగ్రామం ఎగువ రాగిమానుపెంట
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- నేడు అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు

బంగారుపాళెం: ఇంటర్‌తోనే చదువు ఆపేసి, దేశానికి సేవ చేయాలన్న తలంపుతో ఆర్మీలో సైనికుడిగా చేరాడు ఆ యువకుడు. దేశ భద్రత కోసం పదేళ్లుగా శ్రమిస్తున్నాడు. అయితే ఆదివారం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల నడుమ జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వీరమరణం పొందాడు. దీంతో మంగళవారం ఆ యువకుడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంగారుపాళెం మండలం ఎగురాగిమానుపెంట గ్రామానికి చెందిన పంగల వరదరాజులు మండడి, సెల్వి దంపతులకు ఇద్దరు కుమారులు. వారి పెద్ద కుమారుడు రాజేష్, రెండో కుమారుడు కార్తీక్. వరదరాజులు మండడిది రైతు కుటుంబం. కార్తీక్ ప్రాథమిక విద్య బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో చదువుకున్నాడు. డిగ్రీలో చేరాలనుకునేలోపు 2015 నవంబర్‌లో జరిగిన ఆర్మీ సెలక్షన్లకు వెళ్లి సైనికుడిగా ఎంపికయ్యాడు. మొదట రాజస్థాన్‌లో 87 ఆర్మడ్ రేజ్‌మెంట్‌లో పోస్టింగ్ వచ్చింది. అక్కడ ఏడేళ్ల పాటు పనిచేశారు. అక్కడి నుంచి రెండేళ్ల క్రితం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల నిర్మూలన కూబింగ్ కోసం రాష్ట్రీయ రైఫిల్(22 ఆర్‌ఆర్)విభాగానికి వెళ్లారు. రెండు నెలల క్రితం స్వగ్రామమైన ఎగువ రాగిమానుపెంట గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో గడిపారు. తిరిగి విధి నిర్వహణ కోసం జమ్ముకశ్మీర్‌కు వెళ్లాడు. ఆదివారం జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులకు ఆర్మీ జవాన్లకు మధ్య జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వీరమరణం పొందాడు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు కార్తీక్ తండ్రి వరదరాజులు మండడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఉగ్రవాదుల కాల్పుల్లో కార్తీక్ వీరమరణం చెందడంతో ఎగువ రాగిమానుపెంట గ్రామంలో విషాదం అలముకుంది. గ్రామానికి వచ్చినప్పుడల్లా అందరితో సరదాగా మాట్లాడేవాడని గుర్తుచేసుకున్నారు. కార్తీక్ వీరమరణం బాధ కలిగించినా దేశసేవ కోసం ప్రాణత్యాగం చేయడం గ్రామానికి గర్వకారణమన్నారు. కాగా మాజీ మంత్రి ఆర్కే రోజా ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు.



కార్తీక్ కుటుంబ సభ్యులు



విలపిస్తున్న కార్తీక్ తల్లి సెల్వి

నేడు వీరజవాన్ అంతిమ సంస్కారాలు

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం చెందిన జవాన్ కార్తీక్ అంతిమ సంస్కారాలను బుధవారం అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు. కార్తీక్ భౌతికకాయం మగళవారం రాత్రి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఎగువరాగిమానుపెంట గ్రామానికి తీసుకొచ్చేందుకు సంబంధిత ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారని జిల్లా సైనిక సంక్షేమశాఖకు చెందిన అధికారి వినాయకంరెడ్డి తెలిపారు.



కుటుంబ సభ్యులతో కార్తీక్

రెండు రోజుల క్రితం ఫోన్ చేసి మాట్లాడాడు



నా కుమారుడు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఫోన్ చేసి మాతో మాట్లాడాడు. క్షేమంగా ఉన్నానని తెలిపాడు. నాలుగు నెలల్లో ఇంటికి సెలవుపై వస్తానని చెప్పాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. రాంగ్ కాల్‌గా భావించి కట్ చేశాము. మళ్లీ కాల్ వచ్చింది. మేము ఆర్మీ అధికారులు మాట్లాడుతున్నాము. కశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో మీ అబ్బాయి గాయపడ్డాడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేసి మరణించాడని చెప్పడంతో కుప్పకూలిపోయాము. కూమారుని వీరమరణం వార్త వింటాననుకోలేదు.

– వీరజవాన్ తండ్రి వరదరాజులు మండడి

పెళ్లి సంబంధం చూశాం



ఆర్మీలో ఉన్న తమ్ముడికి పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూశాం. నా భార్య చెల్లెని ఇచ్చి వివాహం చేయాలనుకున్నాం. నవంబర్, డిసెంబర్ నెలల్లో పెళ్లి చేయాలనుకున్నాం. ఇంతలోనే తమ్ముడు కార్తీక్ ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం చెందాడు. తట్టుకోలేకపోతున్నా. ఆర్మీ వాళ్ల కష్టాలు తెలిసిన నాకు తమ్ముడు ఆర్మీలో చేరడం ఏ మాత్రం ఇష్టం లేదు. ఉన్నతవిద్య చదువుకుని వేరే ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నా. నేను కూడా ఆర్మీ సెలక్షన్‌కు వెళ్లి తిరిగి వచ్చేశాను.

– వీరజవాన్ అన్న రాజేష్

‘ఫెస్టివల్’లో శ్రీసిటీ సేవలు అభినందనీయం

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ సేవలు అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసించారు. మంగళవారం సూళ్లూరుపేట జూనియర్ కాలేజ్ మైదానంలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని మంత్రి ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ, సీఎస్ఆర్, జీవవైవిధ్యం వంటి అంశాలపై పారిశ్రామిక వర్గాలు, నిపుణులతో శ్రీసిటీలో విజయవంతంగా సదస్సులు నిర్వహించడంపై అభినందించారు. పండుగ నిర్వహణలో శ్రీసిటీ సహకారాలను కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. అనంతరం మంత్రి, కలెక్టర్‌కు శ్రీసిటీ ఎండీ కృతజ్ఞతలు తెలిపారు. సుస్థిర పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ నిర్వహణకు శ్రీసిటీ కట్టుబడి ఉంటుందన్నారు. జీవవైవిధ్యంపై ప్రజల బాధ్యతలను పెంపొందించడానికి పక్షుల పండుగ ప్రత్యేకమైన వేదికని వెల్లడించారు.



రవీంద్ర సన్నారెడ్డిని సత్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్

వేదిక్ వర్సిటీలో పీహెచ్‌డీకి దరఖాస్తులు

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ వర్సిటీలో విద్యావర్ధిని (పీహెచ్‌డీ) కోర్సులో అడ్మిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ తారక రామ కుమారశర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యావర్ధిని కోర్సులో అడ్మిషన్లను ప్రవేశ పరీక్ష ద్వారా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతరర వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను కానీ, 0877–2222587, 9701001777 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 70 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ : ఢిల్లీకి చెందిన ఎస్‌బిఐటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 120మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 70మంది ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కళాశాల పనిచేస్తుందని వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రత్యేక అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐటీ ప్లేస్‌మెంట్ అధికారులు మనీష్ పాండియా, అశోక్ కుమార్, ఎస్పీడబ్ల్యూ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

‘భవిత’ విద్యార్థికి అభినందన

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల భవిత కేంద్రం విద్యార్థి, విభిన్న ప్రతిభావంతుడు వడ్లమూడి రమేష్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. మంగళవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో రమేష్‌కు రూ.50వేలు విలువ చేసే బ్యాటరీ మోటార్ సైకిల్, రూ.10వేలు నగదు బహూకరించారు. అలాగే డీఈఓ కేవీఎస్ కుమార్ రూ.5వేలు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి రూ.5వేలను వడ్లమూడి రమేష్ తల్లి కోటేశ్వరమ్మకు అందించారు. సహిత విద్య టీచర్ భవానీ మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న రమేష్ హైదరాబాద్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల ప్రిలిమ్స్‌లో రూ.10వేల నగదు బహుమతి దక్కించుకున్నట్లు వెల్లడించారు. అలాగే బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో విజేతగా నిలిచినట్లు వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ బాలాజీ, సహిత విద్య టీచర్ జ్ఞానమ్మ పాల్గొన్నారు.



రమేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

బరితెగింపు

– తెలుగుగంగ ఉపకాలువను పూడ్చి మద్యం దుకాణానికి దారి ఏర్పాటు



చిన్న పాండూరు సమీపంలో మద్యం దుకాణం వద్ద పూడ్చివేతకు గురైన తెలుగుగంగ కాలువ

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీలోని అపోలో టైర్స్ పరిశ్రమకు వెళ్లే మార్గంలో వీకేఆర్ వైకాలనీ వద్ద ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు మద్యం దుకాణదారుడు బరితెగించాడు. అటువైపుగా వెళ్తున్న తెలుగుగంగ ఉపకాలువను పూడ్చి దుకాణానికి దారి ఏర్పాటు చేసుకోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. అంతేగాక దుకాణం ఏర్పాటు చేసుకున్న భవనం సైతం ఆక్రమిత శోత్రియం భూముల్లో నిర్మాణం చేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, తెలుగుగంగ కాలువను పరిరక్షించాల్సిన ఆ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతుల అవసరాలకు తవ్విన తెలుగుగంగ కాలువను ఏకంగా పూడ్చి వేస్తే పట్టించుకోకపోవడమేమిటని ఆ ప్రాంత స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

తిరుపతిలో డ్రైవర్ కిడ్నాప్

– వార్నింగ్ ఇచ్చి వదిలేసిన దుండగులు

తిరుపతి క్రైం : తిరుపతి నగరంలోని కొర్లగుంటలో ఓ డ్రైవర్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు వార్నింగ్ ఇచ్చి వదిలేసి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన నవీన్ చిన్నపాటి ట్రావెల్స్ నడుపుతున్నాడు. అతడి వద్ద కొర్లగుంటకు చెందిన షేక్ ఇబ్రహీం డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో షేక్ ఇబ్రహీం సొంతంగా కారు కొనుక్కోవడంతో.. నవీన్ జీర్ణించుకోలేక కోపం పెంచుకున్నాడు. తన వద్దకు డ్రైవింగ్‌కి రాలేదని సోమవారం రాత్రి గురువారెడ్డి సమాధుల వద్ద షేక్ ఇబ్రహీమ్‌ను అడ్డుకుని తన స్నేహితులైన అస్లాం, రాజేష్, హరితో కలిసి బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోయాడు. కోరమేను గుంట వద్దకు తీసుకెళ్లి దాడి చేశారు. అనంతరం వదిలేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్ : హత్య కేసులో తిరుపతి లక్ష్మీపురానికి చెందిన కనిక శంకర్ అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్ మంగళవారం తీర్పు చెప్పారు. ఈస్ట్ స్టేషన్ సీఐ రామకృష్ణ, కోర్ట్ కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన వివరాల మేరకు... తిరుపతి లక్ష్మీపురానికి చెందిన ఏ.రాజా ఓ టింబర్ డిపోలో పనిచేసేవాడు. అతడికి ఇద్దరు పిల్లలు. వారిలో కుమారుడు భరత్ ఇంటర్మీడియట్ చదివాడు. 2020 నవంబర్ 29వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో నిందితుడు శంకర్ మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై రాజా ఇంటి వద్దకు వచ్చాడు. భరత్‌ను బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లారు. కాసేపటి తర్వాత భరత్ ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఇంతలో భోజనానికి రావాలంటూ రాజా బెడ్ రూమ్ లోకి వెళ్లి భరత్‌ను పిలిచాడు. ఆ సమయంలో భరత్ పెదవి వద్ద రక్త గాయాన్ని రాజా గుర్తించాడు. అనంతరం రాజా తన భార్యతో కలిసి భరత్‌ను తీసుకుని శంకర్ ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన శంకర్ కత్తితో భరత్‌పై దాడి చేసి పరారయ్యాడు. స్థానికుల సాయంతో కుమారుడు భరత్‌ను రాజా హుటాహుటిన ఆటోలో రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. రాజా ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ అప్పటి సీఐ శివప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు శంకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకే నేరం రుజువు కావడంతో నిందితుడు శంకర్‌కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోటేశ్వర్ రెడ్డి వాదించారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

చిత్తూరు అర్బన్: జిల్లాలో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరు జిల్లాలో 10, తిరుపతి జిల్లాలో 23 దుకాణాలు గీత కులాలకు కేటాయిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది. ఇందులో చిత్తూరులోని గౌడ్ కులాలకు ఒకటి, తిరుపతిలో 3, ఈడిగలకు చిత్తూరులో ఏడు, తిరుపతిలో 15, గౌడలకు చిత్తూరు 1, తిరుపతి 2, గౌండ్లలకు చిత్తూరులో 1, తిరుపతిలో 3 దుకాణాలు కేటాయించారు. లైసెన్స్ రుసుము నాన్ రీఫండబుల్ రూపంలో రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రెండు రోజుల్లో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి దరఖాస్తుల కోసం నోటిఫికేషన్ జారీచేయనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారు. ఒక అభ్యర్థి ఆయా జిల్లాల పరిధిలో కేటాయించిన అన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు లాటరీలో వస్తే.. ఒక్క దుకాణం మాత్రమే ఎంచుకోవాలి. లైసెన్సు ఫీజును అన్–రిజర్వు దుకాణాల ఫీజుతో పోలిస్తే 50 శాతం తగ్గించారు. అంటే 50 వేల కంటే తక్కువ జనాభా ఉన్న మండలాల్లో రూ.27.5 లక్షలు, 50 వేల పైబడి ఉన్న ప్రాంతాల్లో రూ.32.5 లక్షలుగా నిర్ణయించారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు చెల్లుబాటయ్యేలా లైసెన్సులు జారీ చేయనున్నారు. ఇప్పటికే ఉన్న అన్–రిజర్వుడు మద్యం దుకాణాలు మూడు నెలల క్రితం ఏర్పాటైతే, ఆ ఆదాయాన్ని గీత కార్మికులు కోల్పోయినట్లేనని, మరోవైపు కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా కూటమి ఎమ్మెల్యేల వద్ద ఉన్న బినామీలకు దుకాణాలు కేటాయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని అసలైన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేలు రకాల గొర్రె జాతుల అభివృద్ధే లక్ష్యం

తిరుపతి సిటీ: మేలు రకాల గొర్రె జాతులను అభివృద్ధి చేసి రైతులకు పంపిణీ చేయడమే వెటర్నరీ వర్సిటీ లక్ష్యమని వీసీ జేవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీ నిరంతర విద్యా సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతులలో గొర్రెల, మేకల పెంపకం అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే అవగాహన కార్యక్రమాన్ని వర్సిటీలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకం లాభసాటిగా కొనసాగాలంటే మరణాల శాతం తగ్గించుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక శక్తి పెంచే సమతుల్య ఆహారాన్ని గొర్రెలకు, మేకలకు అందించాల్సి అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు బి శోభామణి, నిర్వాహకురాలు ప్రొఫెసర్ కే సుజాత, డాక్టర్ గంగరాజు, అధ్యాపకులు, లె లుగు రాష్ట్రాల నుంచి రైతులు హాజరయ్యారు,.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ జేవీ రమణ